క్లుప్తంగా

ప్రథమ చికిత్సపై అవగాహన

శిరివెళ్ల: మండలంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయి. బుధవారం గోవిందపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో వైద్య సిబ్బంది గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. మండల కేంద్రంలో వీఓఏలు తమ కార్యాలయ ఆవరణం, వీధుల్లో పారిశుద్ధ్య పనులు చేయించారు. ఎంపీడీఓ సుబ్రమణ్యం, ఈఓఆర్డీ నాగేంద్ర పర్యవేక్షించారు.

విద్యార్థులు స్వచ్ఛాతా హీ సేవలో పాల్గొనాలి



మాట్లాడుతున్న డీఆర్‌ఓ పద్మజ

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు స్వచ్ఛందంగా స్వచ్ఛాతాహీ సేవలో పాల్గొనాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి పద్మజ తెలిపారు. బుధవారం పట్టణంలోని వివేకానంద ఆడిటోరియంలో స్వచ్ఛాతాహీ సేవపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

కొనసాగుతున్న వైద్యుల సమ్మె



ఆలమూరు పీహెచ్‌సీలో తెరుచుకోని వైద్యుడి గది

రుద్రవరం: పీజీ వైద్య విద్యలో ఇన్ సర్వీసు కోటా కుదిస్తూ తీసుకొచ్చిన 85 జీఓను రద్దు చేయాలని మండలంలోని రుద్రవరం, నర్సాపురం, ఆలమూరు పీహెచ్‌సీల వైద్యాధికారుల నిరసనలు కొనసాగుతున్నాయి. బుధవారం విధులను బహిష్కరించారు. వచ్చిన రోగులకు స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులే మందులు ఇచ్చి పంపించారు.

పౌర్ణమి పూజలు



హోమాలు నిర్వహిస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో బైటిపేటలో వేలసిన శ్రీచౌడేశ్వరిదేవి దేవస్థానంలో బుధవారం మహాలయ పౌర్ణమిని పురస్కరించుకొని చౌడేశ్వరి దేవికి చౌడేశ్వరిదేవి సేవాసమితి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిచారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలో వెలసిన స్ఫటిక లింగేశ్వరాలయంలో స్వామి యోగానంద ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం హోమాలు జరిపించి పూర్ణాహుతి గావించారు.

భవన నిర్మాణ పనుల పరిశీలన

చాగలమర్రి: మండల కేంద్రంలో రూ.32.33 లక్షలతో గ్రంథాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 6 పడకల అదనపు భవనాలను నిర్మిస్తున్నట్లు ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్ ఏఈ హరీష్ తెలిపారు. రెవెన్యూ అధికారులు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న 4 సెంట్ల స్థలాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థకు కేటాయించారు. దీంతో రూ.22.50 లక్షలకు టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ చాంద్‌బాషా పనులను ప్రారంభించారు. అలాగే చాగలమర్రి పీహెచ్‌సిలో రూ.9.83లక్షలతో 6 పడకల అదనపు గదిని నిర్మిస్తున్నట్లు హరీష్ తెలిపారు.

నేటి నుంచి ఆర్‌బీఐ క్విజ్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 90వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా యూజీ చదువుతున్న విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు ప్రకటిస్తూ ఆర్‌బీఐ-90 పేరుతో క్విజ్ పోటీలు నిర్వహిస్తోంది. ఉమ్మడి జిల్లాలో సుమారు 1,716 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు పోటీలు నిర్వహించనున్నారు.

ప్రభుత్వ ధోరణి సరికాదు

చాగలమర్రి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన మెడికల్ కళాశాలలపై ప్రస్తుత ప్రభుత్వం కక్షగట్టిందని ఆర్‌ఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జగన్, లింగమయ్య అన్నారు. బుధవారం స్థానిక వాసవీ డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి 7 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు మంజూరు చేయించారన్నారు. కక్ష సాధింపు ధోరణితో పులివెందుల వైద్య కళాశాలలో వైద్య సీట్లు రద్దుకు సీఎం చంద్రబాబునాయుడు మెడికల్ కౌన్సిల్‌కు లేఖ రాశారని ఆరోపించారు.

ఉమెన్ సేఫ్టీపై అవగాహన

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని రామకృష్ణ పీజీ కళాశాలలో బుధవారం సైబర్ క్రైమ్, హ్యూమన్ ట్రాఫికింగ్, ఉమెన్ సేఫ్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ క్రైమ్ అధికారి ఈశ్వర్ సైబర్ నేరాలు, హ్యూమన్ ట్రాఫికింగ్, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల గురించి వివరించారు. బ్యాంక్ వివరాలు, ఓటీపీ సీసీవీ నెంబర్స్, పాస్‌వర్డ్ ఎవరికీ ఇవ్వకూడదని చెప్పారు. ప్రిన్సిపాల్ వెంకటరావు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలతో సత్ఫలితాలు

నంద్యాల(అర్బన్): పంట కోత ప్రయోగాలతో సత్ఫలితాలు సాధించవచ్చని ఏడీఏ రాజశేఖర్ తెలిపారు. స్థానిక ఏఓ కార్యాలయంలో బుధవారం ఏఈఓ, వీఏఏ, వీహెచ్ఏ, ఎంపీఈఓలకు పంట కోత ప్రయోగాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

పిల్లల ఫీజు ఎలా కట్టాలో..

ఇద్దరు పిల్లలతో కనిపిస్తున్న ఈమె పేరు వరాలు. స్వగ్రామం మండల కేంద్రం రుద్రవరం. భర్త ప్రభాకర్ కూలీ పనుల ద్వారా తెచ్చే సొమ్ముతో కుటుంబం జీవనం సాగిస్తుంది. ఇద్దరు ఆడపిల్లలు పెద్ద పాప మేఘన 3వ తరగతి, చిన్నపాప వర్షిణి 1వ తరగతి చదువుతున్నారు. చంద్రబాబు ఎంతమంది ఉంటే అందరికీ రూ. 15 వేలు చొప్పున ఇస్తానంటే పిల్లలు ఇద్దరినీ ప్రైవేటు పాఠశాలలో చేర్పించారు. స్కూళ్లు తెరిచి మూడు నెలలు దాటడంతో యాజమాన్యం ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేస్తుంది. సర్కారు మాత్రం తల్లికి వందనం పథకానికి పంగనామాలు పెట్టింది. ఏం చేయాలో అర్థం కావడం లేదని, వైఎస్‌జగన్ పాలనలో పాఠశాలలు తెరవగానే అమ్మఒడి పథకం డబ్బులు జమ అయ్యేవని గుర్తు చేసుకుంటున్నారు.



సూపర్ చీట్

- అధికారంలోకి వచ్చి వంద రోజులైనా ఒక్కటీ అమలు కాలేదు
- నమ్మి మరోసారి మోసపోయిన ప్రజలు
- ఆరునూరైనా ఎన్నికల హామీలు అమలు చేయాల్సిందేనని లబ్ధిదారుల డిమాండ్

-ఎన్నికల ముందు చంద్రబాబు 'సూపర్ సిక్స్' హామీలు



చాగలమర్రిలో నెలకు రూ. 1500, ఏడాదికి 3 సిలిండర్లు అంటూ గ్యారెంటీ ఇస్తున్న అఖిలప్రియ



ఆళ్లగడ్డలో ఎన్నికల సమయంలో సూపర్ 6 హామీలపై మాట్లాడుతున్న బాబు (ఫైల్)



చెల్లని మంత్రి గారి మాట

మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు పంట సాగుకు రూ. 20 వేలు సాయం చేస్తాం. కుటుంబంలో ఎంత మంది విద్యార్థులు బడికి వెళ్తారో అంతమందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున ఇస్తాం. ఇద్దరుంటే రూ.30వేలు, నలుగురు ఉంటే రూ.60వేలు ఇస్తాం. మహిళలకు ప్రతి ఇంటికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందజేస్తాం. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేసే అవకాశం కల్పిస్తాం. 18ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తాం. ఇంటికో ఉద్యోగంతో పాటు ఉద్యోగం వచ్చేంత వరకు ప్రతి నిరుద్యోగికి రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తాం.

– నంద్యాలలో ఎన్నికల ప్రచార సభలో మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్



మే9వ తేదీన ఈనాడులో సూపర్ సిక్స్ హామీలపై ఎంపీ బైరెడ్డి శబరి ఇంటర్వ్యూ

బాబుగారి హామీలు

1. అన్నదాత సుఖీభవ' కింద ప్రతి రైతుకు ఏడాదికి రూ 20 వేలు ఆర్థిక సహాయం
2. 'తల్లికి వందనం' కింద ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి ఏడాదికి రూ 15 వేలు
3. ప్రతి కుటుంబానికి ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఫ్రీ
4. ఉద్యోగం వచ్చే వరకు నెలనెలా నిరుద్యోగ భృతిగా రూ. 3వేలు
5) 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ 1,500 సాయం
6. మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణ సౌకర్యం

నంద్యాల/ఆళ్లగడ్డ: అనుకున్నట్టే జరిగింది. చంద్రబాబు నాయుడు ఎప్పుడూ ఇచ్చిన మాటపై నిలబడడు అని మరో సారి తేట తెల్లమైంది. ఎలాగైనా సీఎం గద్దెనెక్కడమే లక్ష్యంగా సంపద సృష్టిస్తాం.. అది ప్రజలకు అందరికీ పంచి పెడుతాం అంటూ ఇచ్చిన 'సూపర్ 6' హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేని పరిస్థితి. ఇప్పటికే ఉచిత ఇసుక అంటూ మోసం చేయగా.. తాజాగా ఎన్నికల ముందు ఇంటింటికీ తిరిగి ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలేశారు. 'బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ' కాదని చాటారు. ఎన్నికల్లో కూటమిని నమ్మి ఓట్లు వేసిన ప్రజలు ఇప్పుడు తీవ్ర నిరాశ, నిస్పృహలకు గురవుతున్నారు. 2014 ఎన్నికల్లో మాదిరిగా ఇప్పుడు మారోసారి బాబు చేతిలో మోసపోయామని వాపోతున్నారు.

అధికారంలోకి వచ్చి వందరోజులు అయినా పథకాల అమలుపై కూటమి సర్కారు నోరుమెదపడం లేదు . అసెంబ్లీ సమావేశాల సమయంలో 'సూపర్ 6' పథకాలకు బడ్జెట్ కేటాయించి క్యాలెండర్ ప్రకటిస్తారని అందరూ ఆశించారు. అయితే, అసెంబ్లీలో వార్షిక బడ్జెట్ ప్రవేశ పెట్టక పోవడంతో పాటు రోడ్ మ్యాప్ వేసుకుని వచ్చే ఏడాది నుంచి పథకాల అమలుకు ఆలోచిస్తామని చావుకబురు చల్లగా చెప్పినట్లు అయింది. గడిచిన ఐదు సంవత్సరాల్లో వైఎస్ జగన్ ప్రభుత్వం చెప్పినవి చెప్పినట్లుగా అన్ని పథకాలు పక్కాగా అమలు చేసింది. గతంలో మాదిరిగా మాట తప్పకుండా ఎన్నికల్లో ఇచ్చిన 'సూపర్ 6' హామీలన్నీ వెంటనే అమలు చేయాలని నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో సూపర్ సిక్స్ కింద అర్హులకు అందాల్సిన నగదు..

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	అందాల్సి నగదు
తల్లికి వందనం	58,483	రూ.87.72 కోట్లు
రైతులకు ఏటా రూ.20,000	45607	రూ. 91.21 కోట్లు
మహిళలకు ప్రతి నెలా రూ.1500	113930	రూ. 17.09 కోట్లు
నిరుద్యోగ భృతి	92,526	రూ.27.75 కోట్లు

నంద్యాల నియోజకవర్గంలో సూపర్ సిక్స్ కింద అర్హులకు అందాల్సిన నగదు..

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	అందాల్సిన నగదు
తల్లికి వందనం	68194	రూ.102.29 కోట్లు
రైతులకు ఏటా రూ.20,000	24527	రూ. 49.05 కోట్లు
మహిళలకు ప్రతి నెలా రూ.1500	115300	రూ. 17.29కోట్లు
నిరుద్యోగ భృతి	112320	రూ.33.69కోట్లు



"రూ. 30 వేలు ఇవ్వాలి



ఎన్నికల ముందు టీడీపీ తల్లికి వందనం పేరుతో చదువుకొనే పిల్లలందరికీ పథకాన్ని వర్తింపజేస్తామని ప్రకటించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసి వందరోజులు గడిచాయి. పాఠశాలలకు దసరా సెలవులు కూడా ఇవ్వనున్నారు. ప్రభుత్వం తల్లికి వందనం అమలు చేస్తే మా ఇంట్లో ఉన్న ఇద్దరు పిల్లలకు ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున రూ.30వేలు రావాలి. ఈ పథకాన్ని ఎప్పటి నుంచి అమలు చేస్తారో తెలియడం లేదు. – సుమలత, నంద్యాల



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో ఎన్నికల హామీలన్నీ అమలు చేశారు. 2019 మే20న ప్రమాణస్వీకారం చేసిన ఆయన రెండునెలల్లోనే పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఇందులో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం ప్రవేశపెట్టారు. కోవిడ్‌తో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోయినా ఐదేళ్లు వాటికి నిధులు కేటాయించారు. దీంతో ఒక్క నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లోనే వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ. 3,245.43 కోట్లు ప్రజల బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యాయి.

జగనన్న సంక్షేమ పాలన ఇలా

నంద్యాల			ఆళ్లగడ్డ	
లబ్ధిదారులు	లబ్ధి (రూ.లలో)	పథకం	లబ్ధిదారులు	లబ్ధి (రూ.లలో)
19,819	52.05 కోట్లు	జగనన్న విద్యాదీవెన	21,822	17.36 కోట్లు
32,857	136.84 కోట్లు	అమ్మ ఒడి	36,839	55.26 కోట్లు
18,799	20.76 కోట్లు	జగనన్న వసతి దీవెన	16,152	12.92 కోట్లు
27,581	126.10 కోట్లు	రైతు భరోసా	49,633	268.01 కోట్లు
8,187	17.87 కోట్లు	పంటల బీమా	20,211	10.10 కోట్లు
6,676	1.65 కోట్లు	సున్నా వడ్డీ పంట రుణాలు	16,544	57.90 కోట్లు
10,135	12.84 కోట్లు	ఇన్‌పుట్ సబ్సిడీ	24,596	30.51 కోట్లు
38,855	364. 45కోట్లు	వైఎస్సార్ పెన్షన్ కానుక	42,590	511.08 కోట్లు
16,963	75.37 కోట్లు	వైఎస్సార్ చేయూత	17,687	126.16 కోట్లు
40,792	94.06 కోట్లు	వైఎస్సార్ ఆసరా	38,437	466.44 కోట్లు
61,686	24.14కోట్లు	వైఎస్సార్ సున్నావడ్డీ	52,304	130.76 కోట్లు
1,122	3.70 కోట్లు	వైఎస్సార్‌కాపు నేస్తం	1,708	76.86 కోట్లు
2,879	76.80 లక్షలు	ఈబీసీ నేస్తం	5,887	14.72 కోట్లు
61	51.25 లక్షలు	వైఎస్సార్ కల్యాణమస్తు	70	00.70 కోట్లు
92,46	6.32 కోట్లు	ఆరోగ్య ఆసరా	7277	3.63 కోట్లు
3,134	39.48 కోట్లు	హౌసింగ్	4,212	75.81 కోట్లు
700	10.99 కోట్లు	వైఎస్సార్ బీమా	737	00.25 కోట్లు
2,308	6.48 కోట్లు	వైఎస్సార్ వాహన మిత్ర	1,134	00.41 కోట్లు
40	32.64 లక్షలు	వైఎస్సార్ నేతన్న నేస్తం	91	00.24 కోట్లు
3,295	6.48 కోట్లు	జగనన్న చేదోడు	3184	12.73 కోట్లు
9,845	18.33 కోట్లు	జగనన్న తోడు రుణాలు	3184	12.73 కోట్లు
5,502	2.21 కోట్లు	జగనన్న తోడు (వడ్డీ చెల్లింపు)	7,065	00.42 కోట్లు
35,3673	1,022.42 కోట్లు	మొత్తం	4,55,592	2,223.01 కోట్లు

నిరుద్యోగ భృతి ఇవ్వాల్సిందే



నేను ఏంబీఏ చేశాను. 2015లో డిగ్రీ పూర్తి చేశాను. 2017లో ఏంబీఏ కూడా చేశాను. మాది మధ్య తరగతి కుటుంబం. ఈ ఎన్నికలలో చంద్రబాబునాయుడు నిరుద్యోగులకు నెలకు రూ. 3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తానని ప్రచారం చేశారు. మేము ఎంతో సంతోష పడ్డాం. బాబు సీఎం అయితే నెలకు రూ. 3 వేలు డబ్బులు వస్తాయని అనుకున్నా. నిరుద్యోగ భృతి ఊసే లేదు. ఎన్నికల హామీని వెంటనే అమలు చేయాలి.

– చీమల రవితేజ, ఎంబీఏ, జీనేపల్లె, శిరివెళ్లమండలం

ఇలా మోసం చేస్తారనుకోలేదు



వానకాలం వరి నాట్లు మొదలు పెట్టాం. కాలువకు నీళ్లు కూడా వస్తున్నాయి. ఇప్పటికీ పెట్టుబడి సాయం మాట ఎత్తడమేలేదు. చంద్రబాబు వచ్చినాడు రూ. 20 వేలు వస్తాది అని చెబుతుంటే నిజమే అనుకున్నాం. ఎప్పుడిస్తాడో ఎవరూ చెప్పలేక పోతున్నారు. జగన్ ప్రభుత్వంలో ప్రతి ఏటా చెప్పిన సమయానికి అకౌంట్లో డబ్బులు వేసేవారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక రైతులను ఇంత మోసం చేస్తారని అనుకోలేదు. – సావిత్రి, బాచేపల్లి

నెలకు రూ.1500 ఇవ్వాల్సిందే



మా ఇంట్లో నేను, మా చెల్లెలు, మా అమ్మ ఉన్నాం. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం మహిళలకు నెలకు రూ.1500 ఇస్తానంది. ఎన్నికలు పూర్తయి అధికారంలోకి రావడంతో సాయం అందుతుందని ఆశపడ్డాం. కుటుంబ ఖర్చులకు ఉపయోగపడుతుందనుకున్నాం. ప్రభుత్వం ఏర్పాటయి వంద రోజులు గడిచిపోయినా మహిళలకు రూ.1500 పథకం గురించి ఎవరూ మాట్లాడటం లేదు. ఆశలు పెట్టుకున్న మాకు నిరాశ మిగిలింది. –లక్ష్మీచరిత, నంద్యాల

నిరుద్యోగులకు భృతి అందించేదెన్నడో



నేను ఎంకామ్ చదివాను. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా నిరుద్యోగులకు నెలనెలా రూ. 3 వేల చొప్పున నిరుద్యోగ భృతి అందిస్తామని కూటమి పార్టీలు ఎన్నికల ముందు హామీ ఇచ్చాయి. ఈ సాయం ఉన్నత చదువులు చదువుకున్న మాకు ఎంతో ఉపయోగపడుతుంది అనుకున్నాం. అయితే ప్రభుత్వం ఏర్పాటు అయి వందరోజులైనా ఇప్పటి వరకు దానిపై మాట మాత్రమైనా చెప్పడం లేదు. –షేక్ న్యామతుల్లా, నిరుద్యోగి, నంద్యాల

"రైతు భరోసాను మరిచారా



ఖరీఫ్ ఆరంభానికి ముందే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.13,500 రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేది. ఎన్నికల హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకు రూ.20వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఖరీఫ్ పూర్తయినా రైతు భరోసా గురించి ప్రభుత్వం ఇప్పటి వరకు ఎక్కడా ప్రస్తావన తేవడం లేదు. రూ.20 వేలు అందిస్తే మాలాంటి ఎందరో రైతులు అప్పులు లేకుండా సాగుకు సన్నద్ధమవుతారు.

-వెంకటసుబ్బయ్య, రైతు, బిల్లలాపురం

అప్రమత్తంగా ఉండాలి



పోలీస్ పికెట్ సిబ్బంది అటెండెన్స్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ

శిరివెళ్ల: శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ రవికుమార్ అన్నారు. బుధవారం మండలంలోని సమస్యాత్మక, ఫ్యాక్షన్ గ్రామాలు చెన్నూరు, గోవిందపల్లెలో పర్యటించారు. పోలీస్ పికెట్లను తనిఖీ చేశారు. గ్రామాల్లో శాంతి భద్రతలు, సిబ్బంది గస్తీ, రౌడీ షీటర్ల కదలికలపై ఆరా తీశారు. కొత్త వ్యక్తులు ఎవరైనా గ్రామాల్లోకి వస్తే ఆరా తీయాలన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

రుద్రవరం: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను బుధవారం డీఎస్పీ రవికుమార్ తనిఖీ చేశారు. వివిధ కేసులకు సంబంధించిన రికార్డులు, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. స్టేషన్‌కు వచ్చే బాధితులతో మంచిగా మెలిగి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కార దిశగా నడుచుకోవాలని సూచించారు. ఎస్ఐ వరప్రసాదు ఉన్నారు.


పిల్లల సంరక్షణపై శ్రద్ధ తీసుకోండి



సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(అర్బన్): శిశు గృహంలోని పిల్లల సంరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి స్త్రీ శిశు సంక్షేమ అధికారులను ఆదేశించారు. బుధవారం నంద్యాల పట్టణం పొన్నాపురం కాలనీలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక దత్తత కేంద్రం (జిల్లా బాలల సంరక్షణ విభాగం)ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిశు కేంద్రంలో పిల్లలను ప్రేమతో చూసుకోవడంతో పాటు కుటుంబ వాతావరణం కల్పించాలన్నారు. కేంద్రంలోని ఇద్దరు పిల్లల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. వన్ స్టాప్ సెంటర్, శిశు గృహ కేంద్రాలను పరిశీలించి పిల్లలకు కల్పిస్తున్న వసతుల గురించి కార్యాలయం సూపరిండెంట్ శమంతకమణి, జిల్లా బాలల సంరక్షణ అధికారి స్వప్న ప్రియదర్శిలను అడిగి తెలుసుకున్నారు. శిశు గృహంలో పిల్లలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తానన్నారు. అలాగే ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు.

వరి సాగులో మెలకువలు



ఈ-కేవైసీని పరిశీలిస్తున్న డీఏఓ

గోస్పాడు: రైతులు వరి సాగులో మెలకువలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) మురళీకృష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని నెహ్రూనగర్, యాళ్లూరు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను సందర్శించారు. నెహ్రూనగర్‌లో శాస్త్రవేత్తలు రవికుమార్, బాలాజీ నాయక్, రమణమ్మతో కలిసి వరి పైర్లను పరిశీలించారు. సరైన సస్య రక్షణ, నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. యాళ్లూరులో ఈ-కేవైసీ నమోదును తనిఖీ చేశారు. ఏడీఏలు రామ్మోమన్‌రెడ్డి, సరళమ్మ, ఏఓలు స్వప్నికారెడ్డి, ప్రభావతమ్మ, నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నంద్యాల(రూరల్): పట్టణ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయం నుంచి మార్కెట్‌యార్డు వరకు విద్యార్థులతో కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు కిట్లు పంపిణీ చేశారు.

ఉయ్యాలవాడ: పరిసరాల శుభ్రతతో వ్యాధులు దరిచేరవని డాక్టర్ రాబర్ట్ కెనడీ అన్నారు. బుధవారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా మాయలూరు, పెద్దయమ్మనూరు, ఉయ్యాలవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పారిశుద్ధ్య కార్మికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

గోస్పాడు: పరిశుభ్రతతోనే ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీడీఓ నాగ అనసూయ అన్నారు. మండలంలోని దీబగుంట్ల గ్రామంలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా హైస్కూల్ విద్యార్థులతో కలిసి బుధవారం ర్యాలీ నిర్వహించారు.

కోస్తా తరహాలో పంట నష్టపరిహారం ఇవ్వాలి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న లబ్బి వెంకటస్వామి

నంద్యాల(అర్బన్): ఇటీవల కురిసిన వర్షాలకు రాయలసీమ రైతుల పంటలు దెబ్బతిన్నాయని, కోస్తా ప్రాంత తరహాలో పంట నష్టపరిహారం ఇవ్వాలని నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి కోరారు. నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాల్లోని రైతులతో పాటు కుందూ, కృష్ణ పరివాహక ప్రాంత రైతులు వర్షాలతో నష్టపోయారని, వారిని పరిహారం ఇచ్చి ఆదుకోవాలంటూ బుధవారం జిల్లా కలెక్టర్ రాజకుమారికి మాజీ జెడ్పీటీసీ సూర్యనారాయణరెడ్డి, రైతులతో కలిసి వినతి పత్రం అందజేశారు.

ఆడపిల్లలు..ఆణిముత్యాలు

నంద్యాల(న్యూటౌన్): ఆడపిల్లలు సమాజానికి ఆణిముత్యాలు అని మానసిక తత్వవేత్త హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి అయిన బూర్గుల రామకృష్ణారావు మనువడు మురుముల రాధాకృష్ణరావు అన్నారు. బుధవారం పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం పద్మావతి అధ్యక్షతన పాలమూరు విశ్వవిద్యాలయం మానసిక తత్వవేత్త రాధాకృష్ణరావు పాల్గొని విద్యార్థులకు పలు అంశాల గురించి వివరించారు.

గోవిందపల్లెలో చోరీ

శిరివెళ్ల: మండలంలోని గోవిందపల్లెలో బుధవారం చోరీ జరిగింది. గ్రామానికి చెందిన బద్రి శ్రీనివాసులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉంచిన రూ.15 లక్షల నగదు, 6 తులాల బంగారాన్ని దుండగులు అపహరించారు. ఈ ఏడాది 500 బస్తాల వరిని అమ్మగా వచ్చిన నగదును ఇంట్లో దాచానని విలపించాడు. ఎస్ఐ చిన్న పీరయ్య ఇంటిని పరిశీలించి వివరాలు సేకరించారు.

గల్లంతైన బాలుడు మృతి



శంకరప్ప (ఫైల్)

శిరివెళ్ల: ఈతకు వెళ్లి గల్లంతైన బాలుడు బుధవారం శవమై కనిపించాడు. వివరాలు.. స్థానిక శిరివెళ్ల మెట్టబుడగ జంగాల కాలనీకి చెందిన శంకరప్ప (12) ఈ నెల 17వ తేదీ సాయంత్రం కాలనీ సమీపంలోని కేసీ కెనాల్ శిరివెళ్ల సబ్ చానల్‌లో ఈత కోసం వెళ్లాడు. పొద్దుపోయినా ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు, బంధువులు గాలించినా ఫలితం లేకుండా పోయింది. బాలుడి తండ్రి గురుమూర్తి, బంధువులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ చిన్న పీరయ్య, పోలీస్ సిబ్బంది, కుటుంబ సభ్యులు కాశిరెడ్డినాయన ఆశ్రమం వద్దనున్న కాలువ వద్ద బాలుడి మృతదేహం గుర్తించారు. మృతిపై అనుమానం ఉందని..విచారణ చేయాలని పోలీసులను కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా బాలుడు రుద్రవరం మండలం మాచినేనిపల్లెలో తన అవ్వా తాత ఇంటిలో ఉంటూ అక్కడే ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి చదువుకుంటున్నాడు. 3 రోజులు సెలవులని ఇంటికి వచ్చాడు.

మినీ గోకులాలకు 600 మంది దరఖాస్తు

చాగలమర్రి: ఆళ్లగడ్డ డివిజన్ పరిధిలోని 17 మండలాల్లో 325 మినీ గోకులాలకు గాను 600 మంది దరఖాస్తు చేసుకున్నట్లు పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డీవీ రమణయ్య తెలిపారు. బుధవారం చాగలమర్రిలోని ప్రాంతీయ పశు వైద్యశాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పశువుల దాణా 75 మెట్రిక్ టన్నులు వచ్చాయని.. కావాల్సిన పాడి రైతులు దరఖాస్తు చేసుకుంటే రెండో విడత పంపిణీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే గడ్డి కత్తిరించే యంత్రాలు 10 మంజూరైనట్లు చెప్పారు.

